క్లుప్తంగా

రాజుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగం పరిశోధకుడు పొర్లపల్లి రాజుకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. అబుండెన్స్ అండ్ డైవర్సిటీ ఆఫ్ సాయిల్ ఆర్థరోపోడ్ ఇన్ టర్మరిక్ ఫీల్డ్స్ ఇన్ సెమీ అరిడ్ ట్రాఫికల్ రీజియన్స్ ఆఫ్ కరీంనగర్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రాజుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య పర్యవేక్షణలో రాజు తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

షార్ట్ ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరణ



నయీంనగర్ : కడక్ ఫిల్మ్ వెబ్ సిరీస్ పోస్టర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమను నమ్ముకుని పనిచేస్తే వారిని విజయం వరించడం ఎలా జరుగుతుందో షార్ట్ ఫిల్మ్‌లో కళ్లకు కట్టినట్టు చూపించారన్నారు. తను చేసే వృత్తి పట్ల ప్రతీ ఒక్కరికి గౌరవం ఉండాలనే అంశంపై కడక్ షార్ట్ ఫిల్మ్ వెబ్‌సిరీస్‌ను రూపొందించామని దర్శకుడు సనత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోట వెంకన్న, వికాస్, జంగా రఘువీర్ యాదవ్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

న్యూశాయంపేట : వరల్డ్ రేబిస్ డే సందర్భంగా శనివారం హంటర్‌రోడ్‌లోని జూ పార్క్‌లో ఉన్న జంతువుల హ్యాండ్లర్‌లకు శాయంపేట పీహెచ్‌సీకి చెందిన వైద్యులు, సిబ్బంది రేబిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జంతువులకు టీకాలు వేసిన మామునూర్ లోని పశువైద్య కళాశాల ఫైనలియర్ స్టూడెంట్స్ రేబిస్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డాక్టర్ ఇఫ్తాకార అహ్మద్ రేబిస్ వ్యాధి యొక్క టీకాలు ఆవశ్యకత గురించి సవివరంగా వివరించారు. పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ మౌనిక కుక్క కాటుకు సంబంధించిన వ్యాక్సిన్‌ల గురించి యాంటీ బాడీల గురించి వివరించారు. కార్యక్రమంలో పలువురు జూపార్క్ స్టాఫ్ యాంటీ రేబిస్ వాక్సినేషన్ వేయించుకున్నారు.

ఆర్థికసాయం



హన్మకొండ చౌరస్తా : కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతిచెందిన పసుపునూటి రాజ్‌కుమార్ కుటుంబానికి హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, అధికారులు, మిత్రులు ఆర్థికసాయం అందజేశారు. సేకరించిన రూ.75వేలను రెడ్డి కాలనీలోని రాజ్‌కుమార్ నివాసంలో శనివారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య చేతుల మీదుగా ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని డీఎంహెచ్‌ఓ భరోసా కల్పించారు. ఆయన వెంట అబ్బాస్, రమేష్, గోవర్దన్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటస్వామి, రంజిత్, శ్రీనివాస్, రాజేష్, చలపతి, నాగయ్య, కమలాకర్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి



అనిల్‌కుమార్ (ఫైల్)

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ అనిల్‌కుమార్ అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలిసి సీఐ బొల్లం రమేశ్ శని వారం హనుమకొండ శాంతినగర్‌కాలనీలోని స్వగృహంలో ఉంచిన అనిల్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం కానిస్టేబుల్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎస్సైలు శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. లష్కర్ బజార్, పబ్లిక్ గార్డెన్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

వేగానికి కళ్లెం పడేదెప్పుడు ?

- పనిచేయని సిగ్నల్.. ఆగని ట్రాఫిక్
- న్యూశాయంపేటలో అలంకారప్రాయంగా సిగ్నల్ పాయింట్
- ప్రయాణికులకు తప్పని తిప్పలు



అలంకారప్రాయంగా సిగ్నల్ పాయింట్



రోడ్డుపై ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులు

కాజీపేట అర్బన్ : పనిచేయని సిగ్నల్ లైట్స్, ఆగని ట్రాఫిక్‌తో ప్రయాణం ఎలా చేయాలి దేవుడా ఎక్కడ ప్రమాదం బారిన పడుతామనో భయం వేస్తుందంటూ నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేట చౌరస్తాలో వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు రెండు నెలల క్రితం ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఏర్పాటుపై చూపిన శ్రద్ధ సిగ్నల్ పాయింట్ పనితీరులో లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ఇష్టారీతిన వాహన రాకపోకలు

నిత్యం కాజీపేట నుంచి వరంగల్‌కు, హన్మకొండ నుంచి వరంగల్ వైపు ప్రయాణం కొనసాగించేందుకు అనువుగా తక్కువ సమయంలో గమ్యాన్ని చేరేందుకు బైపాస్‌గా న్యూశాయంపేట మీదుగా ప్రయాణం కొనసాగిస్తుంటారు. దీంతో నిత్యం భారీ వాహనాలతో పాటు, కారు, ద్విచక్రవాహనాల ప్రయాణాలతో న్యూశాయంపేట చౌరస్తా కిక్కిరిసిపోతుంది. న్యూశాయంపేట చౌరస్తా హన్మకొండ, కాజీపేట, వరంగల్, న్యూశాయంపేటను కలిపే ముఖ్యకూడలిగా ఉంటుంది. ట్రాఫిక్ ఇష్టారీతిన కొనసాగుతూ ప్రమాదాలకు నిలువుగా ఉన్న న్యూశాయంపేటలో ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ కంట్రోల్‌కు ఏర్పాటు చేసిన సిగ్నల్ పాయింట్ అలంకార ప్రాయంగా మిగిలిపోయింది.

ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలి



న్యూశాయంపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ పని చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకొని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలి. సురక్షిత ప్రయాణం కొనసాగించే విధంగా వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు సిగ్నల్‌పాయింట్ తోడ్పడే విధంగా కృషి చేయాలి.

– వెనుకంటి సంపత్, న్యూశాయంపేట

26 మంది విద్యార్థులకు ఉపాధి



నియామక పత్రాలు అందజేస్తున్న తిరుమల్‌రావు

హసన్‌పర్తి : నగరంలోని ఎస్వీఎస్ కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ సాధించారు. 'రినాల్ట్ నిసాన్' అనే కంపెనీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. ఈఈఈ, ఈసీఈ, మెకానిక్ విభాగానికి చెందిన విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్న కంపెనీలను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ విద్యాసంస్థల డైరెక్టర్ రాథోడ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుశాంత్, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు

గ్రేటర్ పరిధిలో శనివారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు విభిన్న రకమైన పూలతో బతుకమ్మలను తీసుకొచ్చి అంబరాన్నంటే విధంగా సంబురాలు నిర్వహించారు. వరంగల్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రిలో, వరంగల్ డీసీసీ భవన్‌లో, హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ భవన్ లో ఉద్యోగులు, మహిళలు బతుకమ్మ ఆడారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఎంజీఎం : బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు



హన్మకొండ చౌరస్తా : డీసీసీ భవన్‌లో..



హన్మకొండ : ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో..



మడికొండ : టీఎన్‌జీఓఎస్ కాలనీలో..



హనుమకొండ గాంధీనగర్‌లో..

రైల్వే కాలనీలో స్వచ్ఛభారత్



నిలిచిన వర్షపు నీటిని బయటికి పంపిస్తున్న యూనియన్ నాయకులు

కాజీపేట రూరల్ : కడిపికొండ ఆర్వోబీ కింద ఉన్న ఎలక్ట్రిక్ లోకోషెడ్ రైల్వే క్వార్టర్స్ కాలనీలో శనివారం రైల్వే మజ్దూర్ యూనియన్ ఈఎల్ఎస్ బ్రాంచీ నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. బాపూజీనగర్ నుంచి ఎలక్ట్రిక్ లోకోషెడ్‌కు వెళ్లే ఇరువైపులా రోడ్లు గుంతలు పడి వర్షం నీరు నిల్వడంతో రైల్వే ఉద్యోగులకు ఈ రోడ్లు ఇబ్బందికరంగా మారాయి. నాయకులు ఒక వైపు రోడ్డు మార్గంలో నిలిచి జలమయంగా మారిన వర్షం నీరు వెళ్లేందుకు రైల్వే ప్రహరీకి రంధ్రం చేసి వర్షం నీటిని పంపించారు. కార్యక్రమంలో ఈఎల్ఎస్ బ్రాంచీ సెక్రటరి నాయిని సదానందం, చైర్మన్ ఇబ్రహీం, ట్రెజరర్ రవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రజాపతి, అసిస్టెంట్ సెక్రటరీలు అశోక్, పాశం రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు

హసన్‌పర్తి : స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ జారీ చేసిన జీఓ ఆధారంగా బీసీలకు 42 శాతం రిజరేషన్ కల్పించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు వార్డు సభ్యుల రిజర్వేషన్‌లు డ్రా పద్ధతిలో ఖరారు చేశారు. మండలంలోని తొమ్మిది ఎంపీటీసీలు, 15 గ్రామపంచాయతీల సర్పంచ్‌లను ప్రకటించారు. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్‌లు కేటాయించారు.

ఎంపీటీసీలు

అన్నాసాగరం (ఎస్సీ జనరల్), సిద్ధాపురం (ఎస్సీ మహిళ), మల్లారెడ్డిపల్లి(బీసీ జనరల్), నాగారం (బీసీ మహిళ), పెంబర్తి(బీసీ జనరల్), బైరాన్‌పల్లి (బీసీ మహిళ), సీతంపేట (ఓసీ జనరల్), జయగిరి(ఓసీ జనరల్), మడిపల్లి(ఓసీ మహిళ).

సర్పంచ్‌లు

అన్నాసాగరం (ఎస్సీ జనరల్), సూదన్‌పల్లి (ఎస్సీ, మహిళ), సిద్ధాపురం(ఎస్సీ మహిళ), కొత్తపల్లి (ఎస్సీ జనరల్), మల్లారెడ్డిపల్లి(బీసీ జనరల్), అర్వపల్లి(బీసీ మహిళ), బైరాన్‌పల్లి (బీసీ జనరల్), సీతానాగారం(బీసీ మహిళ),పెంబర్తి (బీసీ జనరల్), సీతంపేట (బీసీ మహిళ), మడిపల్లి(ఓసీ మహిళ), జయగిరి (ఓసీ జనరల్), నాగారం (ఓసీ మహిళ), గుంటూరుపల్లి(ఓసీ జనరల్), హరిశ్చంద్రనాయక్ తండా (ఎస్టీ జనరల్)లకు కేటాయిచారు.

వికసిత్ భారత్‌లో యువత పాత్ర కీలకం

హన్మకొండ కల్చరల్ : వికసిత్ భారత్‌లో యువత పాత్ర కీలకమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ మేరకు వరంగల్ బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం అధికారి మొహమ్మద్ ఆజం, కళాశాల విద్యార్థులు కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో బండి సంజయ్‌ని శనివారం కలిశారు. కళాశాలలో నిర్వహించే వికసిత్ భారత్ సదస్సుకు హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతర ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్‌లో యువత పాల్గొనాలని కోరారు. అందులో ప్రతిభ కనబరిచిన వారికి ప్రధానమంత్రిని కలిసే అవకాశం ఉందని తెలిపారు. కళాశాలలో జరిగే సదస్సుకు హాజరవుతానని పేర్కొన్నారు.

గజల్ గాయనికి సత్కారం

హన్మకొండ కల్చరల్: హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో శనివారం జరిగిన బతుకమ్మ పండుగ మహోత్సవంలో హనుమకొండకు చెందిన గజల్ గాయని గంకిడి అరుణ కీర్తిపతాక గజల్ పాటలు వినిపించారు. ఈ సందర్భంగా అరుణ కీర్తిపతాకను నిలయం ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ రజనీప్రియ మెమొంటో అందజేసి సత్కరించారు.

కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడుదాం

నయీంనగర్ : దేశ ప్రజల ఐక్యతకు ప్రధాన అడ్డంకిగా మారిన కుల వ్యవస్థ నిర్మూలన కోసం ప్రజలందరూ సంఘటితంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. శనివారం నయీంనగర్‌లో డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కుల నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమంలో భాగంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాకేష్, రవి, సూరి, రమేష్, బి.నరసింహారావు, రంజిత్, అర్జున్, శివకుమార్ పాల్గొన్నారు.

పంచ పరివర్తనతోనే దేశం హితం

హసన్‌పర్తి : సమాజంలో అన్ని వర్గాల వారు కలిసికట్టుగా ఉండాలనే లక్ష్యంతోనే పంచ పరివర్తన్‌కు ఆర్ఎస్ఎస్ శ్రీకారం చుట్టిందని హిందూ జాగరణ్ మంచ్ అఖిల భారతీయ సంఘటన్ మంత్రి దేవేందర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలో నిర్వహించిన విజయదశమి కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ అధ్యక్షుడు సంజీ వ్, కాళిదాస్,సాంబయ్య, హరిశంకర్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

న్యూశాయంపేట: ఏనుమాముల 14వ డివిజన్ సుందరయ్యనగర్‌లోని ఖబ్రస్తాన్ నిర్వహణకు కమిటీని ఎన్నుకున్నట్లు మైనార్టీ నాయకులు సయ్యద్ వసీం, మహ్మద్ సలీంలు తెలిపారు. మార్కెట్ సమీపంలోని మిర్చి కళ్లంలో శనివారం జరిగిన సమావేశంలో కమిటీ గౌరవ అధ్యక్షుడిగా అబ్దుల్ ఖయ్యూం. అధ్యక్షుడిగా మహమ్మద్ ఆజం ఖాద్రి (బబ్బు), ప్రధానకార్యదర్శిగా మహమ్మద్ ఉస్మాన్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ సలీం, సయ్యద్ అఫ్జల్, కోశాధికారిగా షేక్ ఉమర్‌లను ఎన్నుకున్నారు.

స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ

సాక్షి, నెట్‌వర్క్ : కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజాప్రతినిధిగా ఎందరో నాయకులకు స్ఫూర్తి ప్రదాత అని పలువురు వక్తలు అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. గ్రేటర్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఆయన చిత్రపటానికి పలువురు ముఖ్యనాయకులు, అధికారులు, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ రాష్ట్ర సాధన తొలి, మలిదశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర మరువలేదన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఆయా పార్టీల, పద్మశాలి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



హన్మకొండ అర్బన్ : ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని



కేయూ క్యాంపస్ : కేయూలో..



ఫోర్టురోడ్డు హనుమాన్ జంక్షన్‌లో..



మడికొండ చౌరస్తాలో..



రామన్నపేటలో..



హన్మకొండ : నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్



ఖిలావరంగల్ : నివాళులర్పిస్తున్న పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్

కుక్కల దాడిలో 20 గొర్రెల మృతి

హసన్‌పర్తి: కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన సంఘటన వంగపహాడ్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన గుండెబోయిన రమేశ్ యాదవ్‌కు 150 గొర్రెలు ఉన్నాయి. ప్రతీరోజు ఉదయం గొర్రెలు మేతకు వెళ్లి తిరిగి సాయంత్ర మందకు చేరుకుంటాయి. శుక్రవారం రాత్రి 10 కుక్కలు మందలోకి ప్రవేశించి గొర్రెలపై దాడులు చేశాయి. ఈ ఘటనలో 20 గొర్రెలు మృతిచెందగా, మరో 35 తీవ్రంగా గాయపడ్డాయి. తనకు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడ కోరాడు. కాగా, సమాచారం అందుకున్న పశువైద్యాధికారి సంఘటనా స్థలానికి చేరుకుని పోస్ట్‌మార్టం చేశారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ఇద్దరికి గాయాలు

మడికొండ : ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన మడికొండ శివారు శ్రీ రాజేశ్వరీ ఫంక్షన్ హాల్ వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..ఆటో కడిపికొండ రాజీవ్ గృహకల్ప నుంచి మడికొండ పోలీసు స్టేషన్ వైపునకు వస్తోంది. భూపాలపల్లి డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు కాశేశ్వరం నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డుకు వెళ్తుంది. ఈ క్రమంలో మడికొండ శివారు శ్రీరాజేశ్వరీ ఫంక్షన్ హాల్ వద్దకు రాగానే కుడివైపు ఉన్న ఆటో టైర్ ఊడింది. ఈ క్రమంలో వెనుక వస్తున్న బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక చేయూత 'కల్యాణలక్ష్మి'

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి : ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక చేయూత కల్యాణ లక్ష్మి అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 44, 45, 46, 54, 64 డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వ ముందుకు తీసుకెళ్తోందన్నారు. గత ప్రభుత్వం రూ.80 లక్షల కోట్లు అప్పు చేస్తే వాటిని రేవంత్‌రెడ్డి సర్కార్ వడ్డీ చెల్లిస్తోందన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, మండల అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మొట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, డివిజన్ అధ్యక్షుడు రాజారపు స్వామి, సదానందం, నాగరాజు, లింగమూర్తి, జక్కుల సదానదం, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు



మాట్లాడుతున్న ఆర్‌జేడీ శ్రీనివాస్

వరంగల్ అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని వరంగల్ రీజియన్ సంయుక్త సంచాలకులు ఉప్పుల శ్రీనివాస్, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా పనిచేసి కరీంనగర్‌లో పదవీ విరమణ చేసిన పోలేపాక నిర్మల పదవీ విరమణ ఆత్మీయ సమావేశం శనివారం వరంగల్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, చాంబర్ ప్రతినిధులు వేద ప్రకాశ్, లింగారెడ్డి, కటకం పెంటయ్య, కాటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చింతలపల్లి వీరారావు, మార్కెట్ ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 3న బంద్



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ సుభాన్

న్యూశాయంపేట : ఆలిండియా పర్సనల్ లా బోర్డ్ దేశవ్యాప్త పిలుపు మేరకు రెండో విడత నిరసన కార్యక్రమాల్లో భాగంగా కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం 2025కు వ్యతిరేకంగా అక్టోబర్ 3న బంద్ పాటించాలని ముస్లిం యూనిటీ అండ్ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్(ఎంయుడీఎం) గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్ పిలుపునిచ్చారు. శనివారం ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నిరసన కార్యక్రమంలో వ్యాపారులు, దుకాణదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంయుడీఎం ప్రధాన కార్యదర్శి మహ్మద్ అలీజుబేర్, గులాం సర్వర్(మున్నాబాయ్), మహ్మద్ ఖలీల్, మహ్మద్ రయీస్, పర్వేజ్, అస్లాం, బాబర్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో బల్దియా, పలు శాఖల అధికారుల ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్ల పనులు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు అధికారులు పర్యటించారు. ఉత్సవాల ఏర్పాట్లను ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగపూరి సంజయ్‌బాబు, మేడిది మధుసూదన్, మండవెంకన్న ఉపాధ్యక్షుడు గోనే రాంప్రసాద్ కలిసి పలు శాఖల అధికారులు పరిశీలించారు. గత ఏడాది కన్న భిన్నంగా ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. పరిశీలించిన వారిలో ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, రంజిత్, సందీప్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, అఖిల్, అశోక్, క్రాంతి, మహేష్, శ్రీను, గోవర్ధన్, చిరంజీవి ఉన్నారు.